


# చివరి అంచున

యామిని

భానుమూర్తి చికాగ్గా కళ్ళు తెరచేడు. కళ్ళు భగ్గున మండేయి కారం చల్లినట్లుగా. వెంటనే తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

కేర్ కేర్ మని చెవుల్లోంచి మెదడులోకి మ్రుక్కలు తిప్పుతూన్నట్లు భరించలేని శబ్దం. కళ్ళు విప్పకుండానే కళ్ళ చుట్టూ కండరాలు బిగించి సన్నగా చూసేడు. పదినిముషాల క్రితం వరకు మెదడును మ్రగించిన ఆలోచనల వేడి గదంతా కమ్ముకున్నట్లుంది. జీరోవాట్ బల్బులోంచి ఎర్రని కాంతి. మండుతూన్న కళ్ళకి చూడలేని కాంతి, వినలేని చెవులకి భరించలేని శబ్దం తలపగిలి ముక్కలు ముక్కలుగా చెదిరిపోతుందేమో ననిపిస్తూంది. పట్టలేని కోపంతో పిచ్చిగా అరుద్దామనిపించింది. చప్పుడు చేస్తే నోట్లోంచి గాలిమాత్రమే బయటికొచ్చింది. దానికే ఎవరో పీక నులిమినట్లుగా అంగుడులో నొప్పి పుడుతూంది. వెలువడని ఆవేశం నరాల్లోంచి గుండెలోకి దూరినట్లుంది. గుండెలో పోటు వస్తూంది. గుండెలో పోటు వచ్చేసరికి ఎక్కడలేని భయం పుట్టుకొస్తుంది.

ఇంటికప్పు కూలి మీద పడుతూన్నట్లుగా గదంతా నీళ్లతో నిండిపోతూన్నట్లుగా భయం. చావంటే భయం. బ్రతికి ప్రయోజనం లేదని తెలిసికూడా చావంటే భయం. భయంతోపాటు గుండెపోటుకూడా ఎక్కువవుతూంది. దాన్ని మరచిపోవడానికి భానుమూర్తి ఎర్రని కళ్ళుతెరచి ఎర్రని కాంతిలోకి చూసేడు.

ఎదురుగా గోడమీద నిలువాటి నీడకు రెక్కలు కదులుతున్నాయి. నీడకూ దీపానికీ మధ్య వ్రేలాడుతూన్న బట్ట ఉయ్యాలలో పిల్లవాడు గుక్కపెట్టి ఏడుస్తూ వడివడిగా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటున్నాడు బిగపట్టిన మెడను మెల్లగా త్రిప్పి చికాగ్గా వెదురు తడికెవైపు చూసేడు భానుమూర్తి.

చీకటిలో ఈగ ఒకటి భానుమూర్తి ముక్కుమీద వాలింది. ఎన్నిసార్లు తోలినా మళ్ళీ అక్కడికేవచ్చి వాలుతూంది. ఛ! అన్నీ ఒక్కసారే సమయం చూసుకొని సాధిస్తున్నాయి.

'శాంతా!'

అమ్మయ్య! మురళి కంఠం. జవాబు లేదు

'శాంతా!'

'ఊఁ!...'

'ఓ సారి లే! లేచి చూడు! బాబు ఏడుస్తున్నాడు!'

'ఊఁ!...'

'లే మరి! మళ్ళీ మా నాన్నకి మెలకువ వస్తే నిద్రపట్టదు!'

శాంత లేచి వచ్చింది. కళ్ళు నులుపుకుంటూ' ఉష్! బబ్బోమ్మా!'-అంటూ ఉయ్యాల ఊపింది.

భానుమూర్తి ముఖం మీద చల్లటి బొట్లు పడ్డాయి. భానుమూర్తి ఉలిక్కిపడ్డాడు. గుండె దడదడ లాడింది. గుండె దడ రావడమే హఠాత్తుగా వస్తుంది. కాని తగ్గడం హఠాత్తుగా జరగదు.

పిల్లవాడు [illegible]. శాంత ఉయ్యాల వూపింది. క్రింద చేయి వేసి చూసింది. వెంటనే వాణ్ణి ఉయ్యాల లోంచి తీసి ఉయ్యాలలో బట్టలు మార్చి మళ్ళీ పడుకోబెట్టింది.

ఆవులిస్తూ ఉయ్యాల చేత్తో పట్టుకొని ఊపడం మొదలుపెట్టింది. అలసిన భానుమూర్తి మనస్సుకు కొంచెం ఉపశమనం కలుగుతూన్నట్లనిపించింది.

శాంత పాత గుడ్డ తీసి ఉయ్యాల క్రింద నేలమీద వేసి ఊగుతూన్న ఉయ్యాల వచ్చినప్పుడు తప్పుకుంటూ కాలితో తోస్తూంది.

'ఈ సారి మురళి తెచ్చివస్తే బాగుండును!' అనుకున్నాడు భానుమూర్తి. అనుకున్న కొలదీ మరీ ఎక్కువ అవసరం అనిపించింది.

మెల్లగా భానుమూర్తి ఎడమచేయి ఎత్తి శాంతకు సైగ చేసేడు. ఆమె ఇటు చూడటం లేదు మరో రెండుసార్లు వృథా ప్రయత్నం చేసేడు భానుమూర్తి.

'అబ్బ! మూడుసార్లు చేయెత్తేసరికే భుజం నెప్పి పుడుతూంది. శాంత వెళ్ళిపోతూంది. వెళ్ళిపోతూ ఒక్కసారి వెనక్కు తిరిగి...అమ్మయ్య! చూసింది.

'మీ నాన్నగారు పిలుస్తున్నట్లున్నారు వెళ్ళండి!' శాంత మురళితో చెప్తూంది.

'లేచేడా?'

'ఆ!'

మురళి బయటకు వచ్చేడు తండ్రి ముఖంవైపు చూసి అలువు తీసి బయటకు వెళ్ళి మూకుడు తెచ్చి మంచం దగ్గరకు వచ్చేడు.

మురళి మూకుడు తీసుకొచ్చినప్పుడల్లా భానుమూర్తికి అదే దృశ్యం గుర్తుకు వస్తుంది.

మురళికి మూడో నెల అప్పుడు భానుమూర్తి అత్తగారింటికి వెళ్ళేడు చూడడానికి. వేరేగదిలో మంచంమీద కూర్చొని ఉండగా వదినగారు మురళిని తెచ్చి చేతికిచ్చింది మాటలమధ్య రెండు నిమిషాలు గడచేసరికి మురళి చటుక్కున బట్టలు తడిపేశాడు భానుమూర్తి ఉలిక్కిపడి తడబడటంలో మురళి చెయ్యి జారిపోయాడు. మురళి క్రిందపడిపోయి గుక్క తిప్పుకోలేనంతగా ఏడ్చేడు.

[illegible] ప్రమాదకరమైన సంఘటన గుర్తుండవలసినది కాదు. కాని గుర్తుండిపోయింది. భానుమూర్తి ఒడిలోంచి క్రిందికిపడ్డ మురళి అతనికోసం తెచ్చిన టిఫిన్ పళ్ళెంమీద పడ్డాడు. రక్తం చూసి కంటికేమయినా అయిందేమోనని భయపడ్డారు కంటికేం కాలేదు. కాని కనుబొమ తెగిపోయింది. ఆనవాలు మిగిలిపోయింది.

మురళి మూకుడు బయటపెట్టి సబ్బుతో చేయి కడుక్కొని లోపలకు వెళ్ళేడు.

భానుమూర్తికి నిద్ర తేలిపోయింది. అంతా నిశ్శబ్దం. ఉయ్యాలకు కట్టిన తాడు మాత్రం కొంచెం గరగరమని చప్పుడు చేస్తూంది. గోడమీద ఉయ్యాల నీడ మెల్లగా కదులుతూంది. ఉయ్యాల పూర్తిగా ఆగిపోయేవరకూ దాని నీడ చూస్తూ శబ్దాన్ని వింటూ పడుకున్నాడు భానుమూర్తి.

నీడలోంచి గోడమీదికి తోక తెగిన బల్లి చరచరా పరిగెత్తుకుంటూ వచ్చింది ఉబ్బిన దాని కళ్ళు భయంకరంగా ఉన్నాయి. ఈ బల్లిని గురించి పిల్లిని గురించి భానుమూర్తి గతంలో ఎప్పుడూ ఆలోచించలేదు. కాని ఇప్పుడు ఈ నాలుగు గోడల ప్రపంచంలో రోజూ అవే అతని మనసు నాక్రమిస్తున్నాయి. అసలు ఆ మాటకొస్తే భానుమూర్తికి తానెప్పుడూ మనుష్యులను అర్థం చేసుకోలేకపోయేడేమో ననిపిస్తుంది అప్పుడు ఆ మనుష్యులకంటె ఇప్పుడు ఈ చిన్న చిన్న జీవులే అర్థం చేసుకున్నట్లనిపిస్తుంది.

వెదురు తడికెకు అవసరంకొద్దీ ఎలుకలు తరువాత ఆటల్లో పిల్లలూ చేసిన చిల్లుల్లో ఒక పెద్ద చిల్లులోంచి శాంత ముఖం సగం కనబడుతూంది ఆమె ముఖంమీద మురళిచేయి. అతని చేతివ్రేళ్ళు అతని మనసులోని భావాలను ఆమె చెక్కిలిమీద ముద్రిస్తున్నాయి.

భానుమూర్తి ఆసక్తిగా అటు చూసేడు గడచిన రాత్రి తాను నిద్రపోతున్నాడనుకొని మురళి శాంతతో అన్న మాటలు గుర్తుకొచ్చేయి భానుమూర్తికి.

'మా నాన్న తన సౌహార్ద్యంతో మా అమ్మను ఏమాత్రం సుఖపెడలేయలేదు శాంతా! ఆయన నోరు విప్పి మాట్లాడనక్కరలేదు ఆయనచుట్టూ ఆవరించే ఆ నిశ్శబ్దమే అంత భయంకరం. అడవిగాచిన వెన్నెలలా గడచిన మా అమ్మ జీవితం గుర్తుకొచ్చినప్పుడల్లా నా గుండె నీరయిపోతుంది!'

ఏవేవో ఆలోచనలతో కృంగిపోతూన్న భానుమూర్తి మనస్సులో క్రొత్త విషాదం అలుముకుంది.

'అంత నేరం నామీద మోపడం న్యాయంకాదు మురళీ!' అతని మనస్సు ఆక్రోశించింది.

శాంత చెక్కిలిమీద కదులుతూన్న వ్రేళ్ళల్లోంచి మురళిని చూసేడు.

'నువ్వు పుట్టకముందు కూడా మీ అమ్మా నాన్నల జీవితాలు గడిచేయిరా! ఆమెను లక్ష్యాన చేర్చుకోవాలనీ ఆమె పొందులో సర్వస్వీ మరచిపోగలననీ నేను కన్న కలలు ఎప్పుడూ చెప్పుకోలేకపోయేనురా! ఇప్పటికీ 'ఆమె' అనుకోగలను తున్నాను కానీ అంతకంటె చనువు అనుకోలేకపోయానని నీకు తెలుసా!' నిశ్శబ్దంతో జవాబును దీర్ఘ నిశ్వాసం బయటకు మోసుకొచ్చింది.

ఆ రాత్రి! తన మనసులోని కోరికలు వెల్లువలై ప్రవహిస్తూన్న ఆ రాత్రి! ఒకే ఒక్క మనిషి తప్ప ప్రపంచమంతా అంధకారంగా కనిపించిన ఆ రాత్రి! ఆ రాత్రిని ఇప్పుడు తిరిగిచూస్తే...

భానుమూర్తి కళ్ళముందు ఆ దృశ్యం నిలుస్తూంది సరికొత్తగా.

మనసును మత్తెక్కించే పరిమళాలు వెదజల్లుతూ దీపాలకు కూడా వెలుగునిస్తూ పార్వతి మనసుతో ప్రమేయం లేకుండానే మరుని విల్లులా పెరిగిన ఆమె శరీరం...అందమైన ఆమె పెదవుల వెనుక ఏవో సందేశాలు దాగినట్లు భ్రమ ..రెపరెపలాడే ఆమె కన్నుల్లోంచి బయటకు చూసే ఆమె మనస్సులో లేని భావాలు ..పట్టులాంటి నూనె రాయని జుట్టులో మల్లెచెండులు... పరిపూర్ణమైన యవ్వనంలో ప్రతిబింబిస్తూన్న అనురాగరంజిత కాంతులు...మైమరపించే

ఉద్రేకంలో కోరికల నిప్పు జ్యోతుల్లా కళ్లల్లో నింపుకున్న తన చూపులు... కొండంత ఆశతో ఆ బంగరు బొమ్మ చుట్టూ చేరిన తన చేతులు...

మబ్బులేని ఆకాశంలోంచి మెరపులేని పిడుగు. చేయి తగలగానే ముడుచుకొని పోయి దూరంగా జరిగిపోయిందా సజీవ శిల్పం.

తీరని కోరికల కుంపటిమీద మరిగే రక్తంతో పొంగే తన హృదయంలో మంచు కత్తిపోటు. నరాలు త్రెంచుకుని ముందుకు దూకుతున్న పశుత్వానికి అడ్డువస్తూన్న మానవత్వపు టభిమానం ...కోరికల వేగాన్ని కళ్లెంలో బిగించలేక తుళ్లిపడుతూన్న మనస్సు...

ఒకసారి కాదు. రెండుసార్లు కాదు. రాత్రంతా కత్తిపోట్లు హృదయాన్ని చిల్లులు చేశాయి. చలితో గడ గడ వణికిపోయాడు. లేచి కిటికీ తలుపు మూసేడు. చలిగాలి బయటినుంచి వస్తే కదా కిటికీ మూయగానే చలి తగ్గడానికి! అవిగో! తిరస్కరించి దూరంగా జరిగి పడుక్కొని మొద్దు నిద్రపోతూన్న ఆమె శరీరంలోంచి ఈ చలిగాలులు. అలాగే చేసేదిలేక ఆమెను నిద్రలో స్పృశించి గుండెలో గాయాల్ని పెంచుకున్నాడు. తెల్లవారేసరికి మనసులో చెరిగిన విప్పులు కళ్లల్లోంచి ఎర్రగా కనబడుతున్నాయి.

అన్ని శక్తులూ ఉడిగేక చివరకు చికాకనిపించినప్పుడు చికాకుపడే శక్తి కూడా లేకపోయిన తర్వాత ఒక దాని తర్వాత ఒకటి అర్థమవుతున్నాయి.

ఆమె మాత్రం ఏం చేస్తుంది? ఆమె దృష్టిలో భర్త అత్తగారి తరపున హింసించడానికి వచ్చిన ప్రతినిధి. ఆ భావాన్ని పుట్టింటిలో ఎవరి అనుభవాల ద్వారానో పిండి ఆమెకు ఉగ్గుపాలతో పోసి ఒంట బట్టించేరు. ఆమె మనస్తత్వంలోని ఆ మహావృక్షాన్ని పెకిలించడానికి తన వయసెంత? తన అనుభవ మెంత? శరీరంలోని యవ్వనం మనసునంతా ఒక అపూర్వమైన అనుభవం మీదకు త్రోసుకొస్తూంటే, అది ఆమె మానసిక రూపంలోని లోప మని తెలుసుకొనేంత సూక్ష్మ దృష్టి [illegible]

# చివరి అంచున

తీరని కోరికలు! తన హక్కు! ఏదో మోసం! ఆమె తనకు లొంగి తీరాలి. అర్థంకాని పోరాటం, తనలోని మనిషిని జయించిన పశువు. ఫలితం! తనకు అద్దంలో మనోహరంగా కనబడే తన రూపంలో ఆమె ఏమి చూసేదో ఏమో... తరువాత తాను కనబడగానే ఫిట్సు!... గాలి, ధూళి వైద్యాలు. తానా ఊరు వెళ్లగానే ఏదో మృగాన్ని చూసినట్లు రొద్దుకు రెండువైపులా కళ్లను పొడిచే చూపులు.

'పార్వతి మొగుడు!' అంటూ చెవులు చిల్లులు పడేటట్లు గుసగుసలు. వాళ్లింట్లోనో... మర్యాదకోసం పెదవుల మీద చిత్రించుకున్న చిరునవ్వుల వెనుక నుంచి తనను వెక్కిరించే భయం అసహ్యం! గదిలోకి పామ్మని పార్వతిని త్రతిమాలడాలు! చిన్నపిల్లలా పెద్ద ఏడుపులు...ఇన్ని సమ్మెటపోట్లు ఒకదాని మీద ఒకటి తగులుతూన్నా స్వాభిమానానికి గంతలుకట్టి వయసులోని ఉద్రేకం తనను ఎన్నిసార్లో ముందుకు నెట్టింది.

ఆరోజు పట్టపగలే చిక్కని చీకటి. నల్లనితెర భూమ్యాకాశాల మధ్య నిలచింది. మొండి అద్దాల గోడలను ముందు నిలబెట్టినట్లు యాభై గజాల దూరంలో వస్తువుకూడా కనబడకుండా కుంభవృష్టి. భానుమూర్తిని ఇంటికి తీసుకెడుతూన్న బస్సు దారి కడ్డంగా కూలిన చెట్టుముందు నిలచిపోయింది. ప్రక్కనుంచి వర్షపునీరు మీద పడుతూంటే కొంచెం లోపలకు జరిగేడు భానుమూర్తి. తలిలో వెచ్చని స్పర్శ. అతని కాలిమీద మూడు రాళ్ల ముద్దుటుంగరాన్ని ధరించిన మృదువైన చేయి. ప్రక్కనున్న మనిషిని దొంగతనంగా చూసేడు భానుమూర్తి. ఆమె వయస్సులో నున్న స్త్రీ. ఆ పరిస్థితుల్లో ఆమె అందచందాలను ఎంచగలిగే శక్తి లేదు భానుమూర్తికి. ఆ స్పర్శలోనే ఏదో అపూర్వమైన అయస్కాంతశక్తి అతని అనుమతిలేకుండానే అతనిచేయి ఆమెచేతిని చేరింది. కూలిన చెట్టుముందు ఇరుకైన బస్సులో చలిమంటలో ఆరు అమృతపు [illegible] చుట్టూ అతలైన పినలైన

చీకటి. బస్సు బయలుదేరింది. అబ్బా! దారిపొడుగునా చెట్లు కూలిపోతే ఎంత బాగుండును! పది నిముషాల తర్వాత తన ఊరికి పది మైళ్లముందే అనుకోకుండా బస్సుదిగి పోయాడు. ఆ చీకటిలో ఆమెకు నీడగా నడిచేడు. కొత్త మనిషితో కొత్తచోట సరికొత్త అనుభవం. మనసులో ఎన్నాళ్లనుంచో గూళ్లు కట్టుకున్న భారం, అశాంతి, వర్షం కురిసిన మబ్బుల్లా విడిపోయాయి. శరీరం దూది పింజలా తేలిపోయింది. ఒక్కక్షణం! ఒక్క స్త్రీని గెలిచిన సంతృప్తి!...ఒక అపూర్వ విజయం! ఉడికిపోయిన మనస్సుకు ఉపశమనం. కాని నాలుగురోజులకు కుళ్లు పొడిచినట్లు ఒళ్లు నెప్పులు! జ్వరం! తలపోటు! ఇది ఎవరికీ చెప్పుకో లేని మరొక రకం బాధ! గుట్టుగా డాక్టరు దగ్గరకు పరుగెత్తేడు. డబ్బు తీసుకుని చేతిమీద సూదిపోటు పొడుస్తూ కళ్లజోడు అద్దాల మీదనుంచి దొంగను చూసినట్లు చూసేడు డాక్టరు.

యుద్ధాల తరువాత సంధి జరిగింది. సంధి స్నేహమెలా అవుతుంది! భానుమూర్తి పార్వతి ఒకరికొకరు పూర్తిగా అపరిచితులుగా ఉండగానే ఒకటి...రెండు మూడు...నాలుగు!

భానుమూర్తి చెంపలు చాలావరకూ తెల్లబడ్డాయి. కాని పార్వతి శరీరం కరగి పోలేదు. పార్వతి మనసు పూర్తిగా వికసించింది. నిలువుటద్దం ముందు నిలబడి భానుమూర్తి లాంటి హృదయంలేని మనిషితో జీవితాంతం ఊహించుకొని ప్రతిబింబం కన్నీటి పొరల్లో కరగిపోయే వరకు నిలబడేది.

పసిపిల్లవాడికి పాలిస్తూ పైపిల్లకు జడవేస్తూ ప్రక్కనున్న పిల్లవాడి కళ్లల్లోకి ప్రేమగా చూస్తూన్న పార్వతి చూపుల్లోంచి, భానుమూర్తికి ఇల్లంతా తనపట్ల శత్రుత్వం పారుతూన్నట్లు కనిపించేది. తాను బయట ఉన్నంతసేపు పిల్లల ఆటలతో కేకలతో మార్మోగి పోయే ఇల్లు తాను ఇంటికొచ్చేసరికి చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దంగా తయారయ్యేది. తను చేసిన శబ్దాలే తనకు వినబడేవి. పరోక్షంలో పిల్లలమీద కలిగే జాలి ప్రేమా పార్వతి అక్కున వాటిని

జాడగానే మాయమయ్యేవి. దగ్గరకు తీసుకుంటే ఒక్కక్షణం నిలబడి చల్లగా జారుకునే వాళ్ల విముఖతను పోగొట్టు కోలేక పోయాడు భానుమూర్తి. బహుశా భానుమూర్తి వాళ్లనుకూడా సరిగా అర్థం చేసుకోలేకపోయాడేమో! కాలం ఒకరకంగా తనకూ వాళ్లకూ మధ్య దూరాన్ని పెంచిందేకాని తగ్గించలేదు.

హైస్కూలు చదువుకు పంపిన పెద్ద కొడుకు ఊరిచివర గానుగ ప్రక్క కొత్త కోమటికొట్లో సిగరెట్ త్రాగుతూ కని పించేడు. ఆరోజు భానుమూర్తి వాణ్ణి వులుసులోకి ఎముకలేకుండా బాదేడు. తల్లి లొ త్రి కళ్లొత్తుకుంటూ వేణ్ణీళ్ల కాప డం పెట్టింది. భానుమూర్తి చేసిన పని వాడిమీద ఏమీ పనిచెయ్యకపోగా కొంచెం జాగ్రత్తపడడం నేర్చుకున్నాడు. 'చదువూ లేదు! చట్టుబండలూ లేదు! పిచ్చి పిచ్చి వేషాలేస్తే కాళ్ళురెండూ విరిచి ఇంట్లో కూర్చోబెడతాను జాగ్రత్త!' వారించేడు భానుమూర్తి. కాని ఏడాది తిరిగేసరికి 'నేను చదువుకోను! నా చదువుకోసం ఏమి ఖర్చుపెట్టినా దండుగ!' అని తన ఎదురుగానే కూర్చొని తల ప్రక్కకు తిప్పి అన్న వాడిమాటలు వినేసరికి భానుమూర్తి గతుక్కుమన్నాడు. తాటిచెట్టు ఎక్కలే నన్నవాడిని ఎక్కిస్తానని పట్టుపట్టడం అర్థమేముంది!

ఏమిటో ఒక్కక్షణంకూడా కాలం ఆగ

# చివరి అంచున


లేదు. భానుమూర్తికి నిలిచి ఆలోచించు కోడానికి సమయం దొరకలేదు. అతని గుండె చప్పుడుతోపాటు అది నడచి పోతూనే ఉంది.

వెదురు తడికెను ఎలుక కొరుకుతూన్న ట్లుంది కొరకొరమని శబ్దం దానికి చిట్లులు చాలలేదు కామోసు! లేదా పళ్లకి అలవాటు తప్పిపోకుండా ఉండ డానికి వ్యాయామమేమో!

భానుమూర్తి ఎదురు గోడవైపు చూసేడు. గోడక్రింద నల్లని చిన్న నీడలో రెండుమెరుపు చుక్కలు. అహో! మార్జాలమా! నాలుగు రోజులనుండి దర్శనమే లేదు! అవును. ఈ నాలుగు రోజులూ ఎలుకను చూసిన గురు కూడా లేదు.

దాని నల్లని ముఖంలో ఎంత ఏకా గ్రత! అడుగులో అడుగు వేసుకుంటూ తడికె ప్రక్కకు చేరి ముడుచుకొని కూర్చొని 'ఎలుకకు చెప్పకు!' అన్నట్లు భానుమూర్తివైపు చూసి రెండుకళ్లూ చికిలించింది.

అది జీవితంలో అసాధారణమైన కొత్త అధ్యాయం. పార్వతి పోయిన ఆరునెలల తరువాత ఒకరోజు సాయంత్రం వచ్చింది శేషమ్మ. పార్వతికి దూరపు చుట్టం! కూడా పధ్నాలుగేళ్ల పిల్ల




ప్రియునా నిన్నెవరూ ఆ సినిమా యాక్టర్లు వస్తే చూడ్డానికి వెళ్లమంది

వాడు. వస్తూనే పెద్దగా ఇంటి కప్పెగిరి పోయేటట్లు ఏడుపు మొదలు పెట్టింది. కళ్లలోంచి కడివెడు నీళ్లు! ఆ పిల్ల వాడు రాయిలా కూర్చున్నాడు. ఆమె నెత్తీనోరూ మొత్తుకుంది. పదిపదిహేను నిమిషాలు ఏడ్చి సడెన్‌గా మానేసింది. ఏవేవో మాట్లాడింది. పార్వతిని పొగి డింది. భానుమూర్తి ముఖాన్ని చూసి భగవంతుడు కళ్లల్లో నిప్పులు పోసు కున్నాడంది. అలనితో అంతకుముందు పరిచయం లేకపోయినా ఓసారి కళ్లతో చూసేవరకు మనసొప్పలేదంది. ఇరవై రెండేళ్ల మురళిని గడ్డం పుణికి 'ఎంత కష్టమొచ్చిందిరా నాయనా!' అంది. వాడికి తల్లి గుర్తుకొచ్చి రెండుకళ్లలో నీళ్లు నిండిపోయాయి. కళ్లు తుడుచు కొని లోపలకు పోయాడు. ఆడదిక్కు లేక ఇల్లు వెలవెల బోతూందని వంటిం ట్లోకి వెళ్లింది.

ఎన్నోరోజుల తర్వాత ఆ రోజు భాను మూర్తికి తిరిగి భోజనం చేసినట్లని పించింది. అడుగడుక్కూ ఆప్యాయత చూపిస్తూ తన హృదయంలో మారుమూల చీకట్లను తడిమి సానుభూతి ప్రకటిస్తూ మీదికి వచ్చే శేషమ్మను దూరంగా ఉంచ లేక పోయాడు అంతకూ దేశద్రిమ్మరిగా తిరుగుతూన్న పెద్దకొడుకోసారి డబ్బు కోసం ఇంటికి వచ్చి శేషమ్మను చూసి అనరాని మాటలన్నాడు నలుగుర్తూ వింటారని తొలిసారిగా వాడడిగిన డబ్బిచ్చి పంపించేడు భానుమూర్తి. ముఖం మాడ్చు కొని కూర్చున్న శేషమ్మను వోదార్చబోతే ఏ మనస్సులో నాకింత చోటుంటే అదే చాలని ఏమీ జరగనట్లుగానే తనపనులు తాను చేసుకుపోయింది.

నాలుగురోజులు తిరగకుండానే కూతు ళ్లిద్దరి దగ్గరనుంచీ ఉత్తరాలు వచ్చేయి. అమ్మను బతికి ఉన్నన్నాళ్లూ హింసిం చేవు! చచ్చిపోయిన తర్వాత ఆవిడ ఆత్మకుకూడా శాంతిలేకుండా చేస్తు న్నావు!' అని. భానుమూర్తి ఉత్తరాలు చదువుతూన్నప్పుడు శేషమ్మ ప్రక్కనే ఉండగా వాటిని కసిగా చింపి శేషమ్మను దగ్గరకు తీసుకోవడం కంటె ఏమీ చెయ లేక పోయాడు. పెద్దవాడు కావలసిన డబ్బు తీసుకుపోడానికి ఇదొక మార్గ

పోయింది.

అసలే ఎక్కువగా మాట్లాడని మురళి కళ్లముందుకు రావడమే మానేశాడు. ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు పోతాడో, ఏం తింటున్నాడో! భానుమూర్తికీ మురళికీ మధ్య శేషమ్మ గోడై నిలచింది.

ఒకరోజు మురళి నిలబడ్డాడు భానుమూర్తి కళ్లముందు తలవంచుకొని.

'ఏమిటి?'

మురళి చాలాసేపు మాట్లాడలేదు. రెండు నిముషాలు అలాగే నిలబడి తండ్రి కెట్టెదుట 'నేనో అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అన్నాడు.

భానుమూర్తి ఉలిక్కిపడ్డాడు. కాని ఆరోజు వాడు నోరు విప్పి అడగాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో అని ఆలోచించలేక పోయాడు. తన కర్తవ్యాన్ని విస్మరించిన విషయం గుర్తుకు తెచ్చి హేళన చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడనే అనుకున్నాడు. భానుమూర్తికి కూడా ఏమనాలో తోచలేదు.

'ఎవరా అమ్మాయి?' చివరకు అడిగేడు

'మన కులం కాదు!'

భానుమూర్తికి ఒళ్లు మండి పోయింది.

'నీకు ఒళ్లు తెలిసే మాట్లాడుతున్నావా? పిచ్చి పిచ్చిగా వాగితే గుమ్మంలో అడుగు పెట్టనియ్యను.'

మురళిలో ఏమీ చలనం లేదు.

'అయితే నేను వెడుతున్నాను.'

'ఎక్కడికి?'

జవాబు రాలేదు మురళి వెళ్లిపోయాడు. భానుమూర్తి కోపంతో అవమానంతో ఊగిపోయాడు అతని ఆలోచనలకు మళ్లీ శేషమ్మ అడ్డు వచ్చింది.

రెండేళ్ల తర్వాత వోసారి మురళి వచ్చేడు. భానుమూర్తి వీధిలోకి వచ్చేసరికే వీధిలో శేషమ్మ ఉంది మురళి రోడ్డుమీద వెనుదిరిగిపోతూ కనిపించేడు. భానుమూర్తి మనసు మూల్గింది

ఉన్నట్లుండి పిల్లి ఒక్కసారి ముందుకు దూకింది ఎలుక ఒక్కసారి కుంయ్ మంది. నల్లపిల్లి తన ముస్తైపు ఏడవ ఎలుకను తినేసింది. ఈ ఎలుకల లెక్కను మరచిపోవాలని ఎంతగానో ప్రయత్నించేడు భానుమూర్తి. కాని సాధ్యం కాలేదు. ప్రయత్నించినకొలదీ


తల్లినుండి పిల్లకు పారంపర్యా వుడ్‌వార్డ్స్' వార్త వాడుకగా వస్తోంది

మీ శిశువును

# వుడ్‌వార్డ్స్

గ్రైప్ వాటర్‌తో

## ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్‌వార్డ్స్' కడుపులో కుట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్లు వచ్చునప్పటి జబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.






సురక్షితంగా వుండండి.
నిబ్బరంగా వుండండి.
సర్వదా ఒక సీసాను దగ్గిరుంచుకోండి.

వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్
తెలివైన తల్లులు వంద ఏళ్లకు మించి వాడుచున్నారు.

AT. 30 TL

మరింత స్పష్టంగా గుర్తుంటూంది.

సరిగా ఆరు నెలల ముందు ఒళ్ళు తెలియని జ్వరంలో ఉండగా శేషమ్మ మూటా ముల్లె సర్దుతూంది. 'ఈ పరిస్థితిలో ఒక్కణ్ణే విడచి ఎక్కడికి వెడుతున్నావు?' అన్నాడు భానుమూర్తి. 'నా జీవితం అంతా నీకు ధారపోశాను. నాలుగు వేల రూపాయలిస్తే ఉంటా' నంది శేషమ్మ. శేషమ్మ కాళ్ళు పట్టుకున్నాడు. భానుమూర్తిని కాలదన్ని వెళ్ళిపోయింది. కన్నుగిప్పి ఏం పట్టుకుపోయిందో తెలియదు

తిరిగి కన్ను తెరిచేసరికి భానుమూర్తి మురళి ఇంట్లో ఉన్నాడు! కులం తక్కువ కోడలు, బాలింతరాలు శాంత పరిచర్యలు చేస్తూంది. భానుమూర్తి సిగ్గుతో కుంచించుకుపోయాడు.

'నిన్ను నీ యింట్లోంచి వెళ్ళగొట్టేనురా! నన్నెందుకురా నీ నెత్తిమీద పెట్టుకుంటున్నావు!' అని అడుగుదామనుకున్నాడు భానుమూర్తి. కాని నోరాడలేదు కుడికాలు కుడిచేయి కదలటం లేదు. కాని అతని మనసులో ఆలోచనలు నిలువలేదు. తన యింటిలో పెరిగిన ఈ మురళిలో ఈ నిగ్రహం ఈ క్షమ ఎన్నడూ తన కంట బడలేదే! బహుశా ఈ దృష్టితో తాను చూడలేదేమో!

శాంత! బంగారుబొమ్మ! ఈ చిన్న వయస్సులో వీళ్ళకి పరస్పరానురాగాలు ఎలా కలిగేయి! ఎంత అదృష్టవంతులు!

ఉన్నట్లుండి భానుమూర్తికి ఆత్మవిశ్వాసం కలిగింది! అవును! జరిగిందేదో జరిగిపోయింది! గతంలో తానెవరి మనోభావాలనూ సరిగా పరిశీలనగా అర్థం చేసుకోలేకపోయాడు. ఇప్పుడో! ఎవరే పని చేసినా దాని వెనుకనున్న భావాన్ని అర్థం చేసుకోగలడు! తనపట్ల మనుష్యులు చూపే నిర్లిప్తతను నిర్లక్ష్యాన్ని విస్మరించగలడు. పరిహాసాన్ని సహించగలడు. ఆప్యాయతకు వెనుకనున్న ఆత్మీయతను కొలిచి దానికి తగిన భావాన్ని ప్రతిబింబింప చేయగలడు. అవును! ఇప్పుడు ఒక విజయవంతమైన జీవితాన్ని గడప డానికి తగిన వివేకం తనకు కలిగింది! కాని... గడపడానికి జీవితమే మిగిల్లేదు. భానుమూర్తి హృదయం ఒక్కసారి కృంగి-పోయింది

ఒక్కసారి తాను గతం ముందుకు నిజంగా పోగలిగితే! జీవితాన్ని మళ్ళీ మొదలుపెట్టే అవకాశం దొరికితే! గతంలోకి జారిన కాలం వెను తిరగదని తెలుసు. కాని దాని స్మృతులు మాత్రం చెరిగిపోవటం లేదు. ఒకటి కాదు రెండు కాదు. ఎన్నో దృశ్యాలు, ఎర్రని కాంతితో మండుతున్న కళ్ళముందు కదలిపోతున్నాయి కిళ్ళీకొట్టు అవతారం సిగరెట్లకు అరువు పెట్టినడబ్బు పెద్దకొడుకు ఇయ్యలేదని వాడిని నడివీదిలో నిలబెట్టి చెప్పుతో కొట్టిన దృశ్యం, చేతిలో డబ్బులేక ఇంట్లో బియ్యాన్ని రెండిళ్ళవతల చిట్టమ్మకు కొలుస్తూ తన్ను చూసి తప్పించుకోలేక తెల్లబోయిన పార్వతి ముఖం, నెలనెలా కొబ్బరికాయల దింపులో ఎదురుగానే నాలుగు కొబ్బరికాయలను తీసుకొనిపోతూ వారించబోయిన తన కళ్ళల్లో దాహాన్ని గుర్తించి, తనపక్క పొలం కాపలా కాసే నరిసిగాడి పెళ్ళాం రత్తి ఎత్తైన రొమ్ము మీంచి పైటజార్చి పళ్ళికిలించే దృశ్యం, తండ్రిని మోసం చేస్తున్నారన్న బాధతో నోరుజారిన మురళిని గుమ్మందిగి మాట్లాడమని శేషమ్మ చూపుడు వేలు చూపించిన దృశ్యం, 'వాణ్ణి ఒక్కసారి చూసి చచ్చిపోతానండీ! మీరు తీసుకొస్తే వస్తాడు. ఒక్కసారి చూపించండీ!' అని తుది ఘడియల్లో ఇల్లువిడచి వెళ్ళిపోయిన పెద్దకొడుకుని తీసుకొనిరమ్మని మొదటిసారిగా పార్వతి తనవొక కోరిక కోరిన దృశ్యం... 'అబ్బాబ్బా! నేను చూడలేను. గడచిపోయిన గతంలోని దృశ్యాలు ఎందుకింత ప్రత్యక్షంగా ముందుకొస్తున్నాయి! శరీరంలో మిగిలిన అవయవాలతో పాటు ఈ మెదడుకు కూడా పూర్తిగా ఎందుకు పక్షవాతం రాలేదు? ఈ మెదడులోని జ్ఞాపకాలగది ఎందుకు నలిగిపోయి నిర్జీవం కాదు? పని చేయవలసిన నరాలు పని చేయక తననింత అవస్థ పెడుతూంటే ఎందుకు ఈ మెదడు మరీ ఎక్కువగా పని చేసి మనసును మలమలా మాడ్చేస్తూంది?

ఇదంతా తన పూర్వజన్మ కాబోలు! అయినా పూర్వ జన్మ కర్మను తీర్చుకుంటూనే తననంటిపెట్టుకున్న వాళ్ళందరినీ హింసించి మరో పది అశాంతి జీవితాలకు తగిన కర్మను చేసుకున్నాడా?'

శాంత పసిపిల్లవాడిని ముద్దుపెట్టుకుంటూంది.

అవసరం వచ్చినప్పుడు వాడు కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ ఏదో సూచిస్తున్నాడు. తనకు ఒకవైపు కాలు చెయ్యి ఆడనే ఆడవు. అదీ చూడకపోతే వాడు కేర్ మని ఏడుస్తున్నాడు. తనకదీ చేత కాదు. వాడిబోసి నవ్వు వెన్నెలలు కురిపిస్తుంది. వాడి అశక్తత వాళ్ళకు అపురూపం. వాడికి సేవచేయడం వాళ్ళకానందం. కాని తనకు సేవ చేయడం ఒక శాపం, తన అశక్తత అందరికీ అసహ్యం. తనకే అసహ్యం. పండంటి వాడి శరీరంలో జ్ఞానంకంటే దివ్యమైన అజ్ఞానం, తనలో కుళ్ళిపోయి పురుగులు పట్టిన మిడిమిడి జ్ఞానం. జీవనవలయం యొక్క మొదటి అంచుపై వాడు చివరి అంచుపై తాను. తెగిన ఈ వలయపుటంచుల మధ్య కాలం పూడ్చలేని అగాథం.

గోడమీద తోకతెగిన బల్లి దూకినట్లుగా నాలుగడుగులు ముందుకు వేసి మూతి కదిపి ముందుకు పోయింది. బహుశా ఇప్పటిదాకా తనను వేధించిన ఈగ బల్లికి దొరికిపోయిందేమో! బల్లి వెళ్ళినవైపే చూసేడు భానుమూర్తి. గోడమీద చివర ఏవేవో నీడలు. మనిషి భయంకరంగా నోరావలించినట్లుగా ఉంది నీడ. భానుమూర్తికి వెంటనే భయం అనిపించింది. చిన్నతనంలో అటువంటి నీడలను చూసి భయపడి సందు లేకుండా దుప్పటి కప్పుకొనేవాడు. కాని ఆనాటి భయానికి కారణం తెలియకపోవడం, తెలిసిన తరువాత ఆ భయం పోవడానికి అవకాశం ఉంది. తెలిసిన తరువాత కలిగే ఈ భయాన్ని పోగొట్టుకొనే దెలా? అప్రయత్నంగా కదిలిన ఎడమ చేయి దుప్పటిని ఒక అంగుళం పైకి లాగింది.

భానుమూర్తి అలసిన కళ్ళు మూతపడుతున్నాయి అతనికి తెలీకుండానే. కళ్ళముందు కళ తరుగుతూన్న ఎర్రని కాంతిలో గోడమీద వెలుగునీడలు ఏకమవుతున్నాయి. ●